క్లుప్తంగా

నేడు చలో మెడికల్ కాలేజ్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం చలో మదనపల్లి మెడికల్ కాలేజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం వర్సిటీలో పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీవారి సేవలో మీనాక్షి చౌదరి



తిరుమల: సినీ తార మీనాక్షి చౌదరి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

శ్రీరామలో మెగా రక్తదాన శిబిరం


రక్త దానం చేస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజ్‌లో గురువారం ఎన్ఎస్ఎస్, విజయశ్రీ బ్లడ్ సెంటర్ సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ రక్త దానం చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడటంలో తమ విద్యార్థులు భాగస్వాములు కావడం గర్వంగా ఉందన్నారు. రక్త దాన శిబిరంలో సుమారు వంద మంది విద్యార్థులు రక్త దానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి, సెక్రటరీ రామసుబ్బారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వాసు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్ గంగరాజుకు సత్కారం


డాక్టర్ గంగరాజును సత్కరిస్తున్న యూనియన్ నేతలు

చంద్రగిరి: ఎస్వీ వెటర్నరీ అసోసియేట్ డీన్ గంగరాజును ఎస్వీ వెటర్నరీ, సెంట్రల్ యూనియన్ నాయకులు గురువారం సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. వెటర్నరీ సేవలను మరింత చేరువ చేయడంతో కార్మికులకు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. అధ్యక్షుడు నాగరాజ, ఉపాధ్యక్షుడు కార్తీక్, రమణ, సెల్వం, మురళి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పండ్లు పంపిణీ


పారిశుధ్య కార్మికులకు పండ్లు, కిట్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు, చంద్రగిరి సర్పంచ్

చంద్రగిరి: భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను గురువారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మునిరాజ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో జన్మదిన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని ప్రధాని నరేంద్ర మోదీ జీవిత విశేషాలను తెలియజేశారు. అనంతరం చంద్రగిరి పంచాయతీ సర్పంచ్ ముదికుప్పం రూపారామ్మూర్తి దంపతులను సత్కరించారు. వారి చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు పండ్లు, ఇతర శానిటరీ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మండల పార్టీ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రం పరిశీలన


ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న టీటీడీ అదనపు ఈవో

తిరుమల: తిరుమల పీఏసీ–5లో ఏర్పాటు చేసిన వినూత్నమైన ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రం రెక్లెయిమ్ ఏస్ పనితీరును అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఆ సంస్థ అధిపతి వివేక్ యంత్రం ఉపయోగాలను వివరించడంతో పాటు ప్రజలకు దీని అవసరంపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. ఇప్పటికే ఈ యంత్రాన్ని ఉత్తరాఖండ్‌లోని చారధామ్‌లో ఏర్పాటు చేసి ప్లాస్టిక్ బాటిళ్లను గంగా జలాల్లో వేయకుండా, వాటిని సేకరించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వినూత్న యంత్రం పనితీరును అదనపు ఈవో ప్రశంసించారు. ఈ సందర్భంగా ఈఈ–5 వేణు గోపాల్, ఎలక్ట్రికల్ డిఈ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లోపించిన పారిశుద్ధ్యం

- దుర్గంధం నడుమ వీవీ నగర్ వాసుల అవస్థలు
- భారీగా నిలిచిపోయిన వర్షపు నీరు
- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని పంచాయతీ సెక్రటరీ


వీవీ నగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చంద్రగిరి: తిరుచానూరు పంచాయతీలో పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది కాలువను పూడ్చివేయడంతో నీరు వెళ్లలేని పరిస్థితి. ముఖ్యంగా వీవీ నగర్‌లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రోడ్డుపైనే మురుగు నీరు నిల్వ ఉంది. దీనికి తోడు భారీగా వర్షపు నీరు చేరడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నీటిని తొలగించాలని పంచాయతీ సెక్రటరీకి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వీవీ నగర్‌లో ఇళ్ల నిర్మాణం చేపట్టే క్రమంలో కొంత మంది కాలువను పూడ్చివేశారు. ఫలితంగా వర్షపు నీరు ఎటూ వెళ్లలేక నిల్వ ఉంటోంది. దీనికితోడు చెత్తాచెదారం తొలగించకపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమల బెడద ఎక్కువైంది. జ్వరాలు ప్రబలడంతో ప్రజలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పారిశుద్ధ్యం లోపించడంపై డీపీవోకు సైతం ఫిర్యాదు చేసినట్లు కాలనీ వాసులు చెబుతున్నారు. డీపీవో ఆదేశాలతో అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకున్నారని ఆరోపిస్తున్నారు.

జగనన్న కాలనీలోనూ తప్పని తిప్పలు

చంద్రగిరి మండలంలోని తొండవాడ జగనన్న కాలనీలో రాత్రి కురిసిన వర్షానికి పెద్ద ఎత్తున నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. దీంతో నడిచి వెళ్లడానికి సైతం వీలుకావడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


కుంటలో నిలిచిన వర్షపు నీరు


తొండవాడ జగనన్న కాలనీలో మోకాళ్లలోతు నీటిలో స్కూల్‌కు వెళ్తున్న చిన్నారులు

ప్రపంచానికి భారతీయ సంస్కృతే మార్గదర్శకం


సదస్సులో మాట్లాడుతున్న హనుమంతరావు

తిరుపతి సిటీ: ప్రపంచానికి భారతీయ సంస్కృతే మర్గదర్శకమని వివేకానంద కేంద్ర అఖిల భారత ఉపాధ్యక్షుడు హనుమంతరావు తెలిపారు. ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం సెనేట్ హాల్లో రోల్ ఆఫ్ కల్చర్ ఇన్ బిల్డింగ్ నేషనలిజం అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాల్లోనే దేశ ఔన్నత్యం ఇమిడి ఉందని చెప్పారు. స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బీవీ మురళీధర్ మాట్లాడుతూ సంస్కృతి పరిరక్షణ బాధ్యత యువతరంపై ఉందన్నారు. కల్చరల్ అఫైర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ మాట్లాడుతూ మన కళలు, సాహిత్యం, సంస్కృతిని భావి భారతానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. విదేశీ సంస్కృతిని విడనాడి, మన సంస్కృతిని ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో వివేకానంద కేంద్ర ప్రతినిధులు రవి నాయుడు, చెరుకూరి ప్రసాద్, ఉదయ్ కుమార్, రాజశేఖర్, శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ క్యాంపస్ పాఠశాలలో గురువారం వారధి ఇండియా ఫౌండేషన్, స్కూల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా విద్యార్థులకు మానసిక అభివృద్ధిలో పాఠశాల పాత్ర, విద్యాభివృద్ధిలో సోషల్ మీడియా పాత్ర అనే అంశంపై జిల్లా స్థాయి వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌరీ శంకర్, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య సర్టిఫికెట్లు అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా అక్టోబర్ 16న వ్యాసరచన, 18న డిబేట్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో సమస్యలపై వినతి


ఆర్జేడీకి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి సిటీ : స్థానిక ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం సాంకేతిక విద్య ఆర్‌జేడీకి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలో ఒక్కో విద్యార్థి నుంచి నెలకు రూ.3500 వసూలు చేస్తున్నారని, కడుపునిండా భోజనం పెట్టడం లేదన్నారు. తక్షణమే హాస్టల్ నిర్వహణపై విచారణ జరిపించాలన్నారు. హాస్టల్‌లో పారిశుద్ధ్యం లోపించడంతో పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని వాపోయారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్, వీరేష్, కళాశాల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పదోన్నతి కల్పించాలని వినతి

రామచంద్రాపురం: తమకు పదోన్నతి కల్పించాలని వీఆర్ఏలు కోరారు. వారు గురువారం తహసీల్దార్ మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ముందుగా కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ నెల 20, 21వ తేదీలలో తిరుపతి ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలంటూ వీఆర్ఏల జిల్లా అధ్యక్షుడు గోవిందయ్య, మండల అధ్యక్షుడు గంగయ్య, కార్యదర్శి మోహన్, వీఆర్ఏ గీత, బాలసుబ్రమణ్యం కోరారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


లింగేశ్వరనగర్‌లో పింక్ బస్, వైద్య సిబ్బంది 22న మంగళంలో క్యాన్సర్ పరీక్షలు

తిరుపతి రూరల్: స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్‌లో భాగంగా స్విమ్స్ ఆధ్వర్యంలో గురువారం లింగేశ్వరనగర్‌లో మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి ఉదయశ్రీ తెలిపారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ టి.వి.డి.ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు కృష్ణప్రియ, కృష్ణప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ హేమలత, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ నెల 22న మంగళం, తిరుమలనగర్ పంచాయతీల పరిధిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.37.98 లక్షలు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గురువారం చేపట్టిన అమ్మవారి హుండీ లెక్కింపు ద్వారా రూ.37,98,411 ఆదాయం లభించింది. అమ్మవారి ఆలయ హుండీ ద్వారా 90 రోజులకు గాను నగదుతో పాటు 20.850 గ్రాముల బంగారం, 312.200 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో ఏ.జయకుమార్, ఆలయ చైర్మన్ ఎస్.మహేష్ యాదవ్ తెలిపారు.

రామచంద్రాపురంలో భారీ వర్షం


సూరావారిపల్లి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

రామచంద్రాపురం: మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం దంచికొట్టింది. దీంతో రహదారులు జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా మండల వ్యాప్తంగా జోరుగా వర్షం కురవడంతో వాగులు, వంకలు కళకళలాడుతున్నాయి. చేతికి వచ్చే సమయంలో వరి పంట మునిగిపోవడంతో రైతులు వాపోతున్నారు.

డిజిటల్ మారథాన్‌లో భాగస్వాములు కండి

తిరుపతి కల్చరల్: వికసిత్ భారత్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే సంకల్పంతో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఆంధ్ర యువ సంకల్ప 2కే25 అంబాసిడర్ డిజిటల్ మారథాన్‌ను నిర్వహిస్తున్నట్టు సెట్విన్ సీఈవో పి.యశ్వంత్ కోరారు. ఈ నెల 30లోపు కుటుంబ బాంధవ్యాలు, సామాజిక బాధ్యత, ఆరోగ్యకరమైన జీవనం, బాధ్యతాయుత డిజిటల్ ఆవిష్కరణలు తదితరాలపై రెండు నిమిషాల నిడివి గల లఘు చిత్రాలను రూపొందించి సామాజిక మాధ్యమాల్లో అధికారిక హ్యాష్ ట్యాగ్‌లతో www.andrayuvasankalpam.comలో పోస్ట్ చేయాలని పేర్కొన్నారు. ఉత్తమమైన వాటిని ఎంపిక బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.

ధ్యానంతో విశ్వశాంతి


జక్కా రాఘవరావు, పద్మ దంపతులను సత్కరిస్తున్న ధ్యాన, పిరమిడ్ గురువులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ధ్యానం చేయడం వల్ల విశ్వశాంతి నెలకొంటుందని పిరమిడ్ మాస్టర్లు, ధ్యాన గురువులు తెలిపారు. మహతి కళాక్షేత్రంలో పీఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధ్యాన మహాయజ్ఞం గురువారానికి మూడో రోజుకు చేరింది. ఉదయం పిరమిడ్ ఆస్థాన విద్వాంసులు వయోలిన్ గణేష్ బృందం చేపట్టిన సామూహిక అఖండ సంగీత నాద ధ్యానం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పీఎంసీ ట్రస్ట్ చైర్మన్ హన్మంతరాజు, ఎండీ ఆనంద్‌కుమార్, డైరెక్టర్ సంగీతబాబు, పలువురు ధ్యాన గురువులు, పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

టీటీడీకి రూ.10 లక్షల విరాళం

తిరుమల : తెనాలికి చెందిన తడిబోయిన విజయసాగర్ అనే భక్తుడు గురువారం టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

ఇండియన్ హ్యూమన్ రైట్స్ మైనారిటీ రాష్ట్ర కమిటీ ఎంపిక

తిరుపతి కల్చరల్: ఇండియన్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ సెల్ మైనారిటీ విభాగం రాష్ట్ర కమిటీని ఎంపిక చేసినట్లు ఆ సంస్థ ఆలిండియా అధ్యక్షుడు కాణిపాకం మురళి తెలిపారు. ఆయన గురువారం నియామక పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నూతన అధ్యక్షుడిగా షేక్ మహ్మద్ రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ మస్తాన్‌ను నియమించినట్లు తెలిపారు. నూతన కమిటీ ప్రతినిధులు మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంకణాల వినోద్‌కుమార్, ఎస్.దేవీప్రసాద్ పాల్గొన్నారు.

చెవిరెడ్డికి బెయిల్ కోసం పూజలు


కనకదుర్గమ్మను ప్రార్థిస్తున్న రామచంద్రాపురం నేతలు

రామచంద్రాపురం: మద్యం అక్రమ కేసులో అరెస్టు అయిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి త్వరగా బెయిలు రావాలని కోరుతూ నియోజకవర్గ వలంటరీ విభాగం అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కుప్పం భాస్కర్‌యాదవ్, పీవీపురం సర్పంచ్ టెండుల్కర్‌రెడ్డి, శివనారాయణరెడ్డి, ప్రతాప్ అమ్మవారి సన్నిధికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం చెవిరెడ్డిని చూసేందుకు విజయవాడ హైకోర్టుకు వెళ్లారు.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకం చేశారు. అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. గర్భాలయం, ధ్వజస్తంభం, ఉప ఆలయాలు, ఆలయ పరిసరాలను శుద్ధి చేశారు. ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ కేపీ.చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

చెట్టుకు విద్యుత్ మీటర్


చెట్టుకు ఏర్పాటు చేసిన విద్యుత్ మీటరు

రామచంద్రాపురం: మండల కేంద్రంలో రోడ్డుపక్క చెట్లకు, స్తంభాలకు దర్శనమిస్తున్న విద్యుత్ మీటర్లను చూసి రహదారిపై వెళ్తున్నపాదచారులు, వాహనదారులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఈ నిర్లక్ష్యాన్ని చూసి నివ్వెరపోతున్నారు. ఏడాదికాలంగా రామచంద్రాపురం సింగిల్ విండో కార్యాలయం ఎదుట రోడ్డు పక్కన చెట్టుకు విద్యుత్ మీటర్ పెట్టడం ఆశ్చర్యం కలిగిస్తోందంటున్నారు. వర్షాకాలం కావడంతో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రిసెప్షన్ విభాగంపై అదనపు ఈవో సమీక్ష

తిరుమల: సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2వ తేది వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో రిసెప్షన్ విభాగంపై టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి గురువారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతి గదుల కేటాయింపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీఐపీలకు వసతి సౌకర్యంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా రిసెప్షన్, ప్రోటోకాల్ విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. అంతకు పూర్వం ఆయన అన్న ప్రసాద విభాగ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను కూడా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో సీవీఎస్వో మురళీకృష్ణ, రిసెప్షన్ డిప్యూటీ ఈవో భాస్కర్, వీజీవో సురేంద్ర, ఓఎస్డీ సత్రా నాయక్ పాల్గొన్నారు.

అక్రమ కేసులో 93 రోజులుగా చెవిరెడ్డి నిర్బంధం


విజయవాడ ఏసీబీ కోర్టు వద్దవున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- చెవిరెడ్డిని చూసేందుకు తరలివెళ్లిన నేతలు
- కిక్కిరిసిన విజయవాడ ఏసీబీ కోర్టు

తిరుపతి రూరల్ : మద్యం అక్రమ కేసులో అరెస్టు అయిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి 93 రోజులుగా జైలులో ఉన్నారు. ఆయనను సిట్ అధికారులు జూన్ 18న బెంగళూరు ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించి జిల్లా జైలులో నిర్బంధించిన విషయం తెలిసిందే. ఆయనను గురువారం విజయవాడలోని ఏసీబీ కోర్టుకు తీసుకువస్తున్న విషయం తెలుసుకున్న చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఏసీబీ కోర్టు జనంతో నిండిపోయింది. చెవిరెడ్డిని చూసి పలువురు నేతలు భావోద్వేగానికి లోనయ్యారు. "అన్నా.. అక్రమ కేసుల్లో ఇరికించారు.. మీరు తప్పు చేయరని చంద్రగిరి ప్రజలకు తెలుసు.. ఈ అక్రమ కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తారు.. అప్పటి వరకు మీ వెన్నంటి మేముంటాం.. మీపై జరుగుతున్న కుట్రలను ప్రజలకు వివరిస్తాం.." అని పేర్కొన్నారు. అనంతరం కోర్టు నిబంధనల మేరకు ఒక్కొక్కరు చెవిరెడ్డిని కలిశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ చెవిరెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేకే ప్రభుత్వం తప్పుడు కేసు పెట్టి జైలులో వుంచిందని తెలిపారు. ఎన్ని కుట్రలు చేసినా చంద్రగిరి ప్రజలు చెవిరెడ్డికి అండగా నిలబడతారని తెలిపారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరాలు

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని కమిషనర్ ఎన్ మౌర్య తెలిపారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను గురువారం ఉదయం కమిషనర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో భాగంగా అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీపీఎంవో శ్రీనివాస్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్


సబ్‌రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న దస్తావేజు లేఖరులు

చంద్రగిరి: రిజిస్ట్రేషన్ శాఖలో ప్రవేశపెట్టిన కార్డ్‌ప్రైమ్ 2.0లో వస్తున్న సాంకేతిక లోపాలను సరిచేయాలంటూ రెండు రోజుల పాటు పెన్‌డౌన్ ద్వారా నిరసనకు దిగుతున్నట్లు తిరుపతి జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం(జేఏసీ) అధ్యక్షుడు సీఎం కేశవులు(బుజ్జి) తెలిపారు. ఆయన గురువారం దస్తావేజు లేఖరులతో కలసి చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్డ్‌ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు శుక్ర, శనివారాల్లో దస్తావేజు లేఖరులు, కంప్యూటర్ ఆపరేటర్లు, అసిస్టెంట్లు రెండు రోజులపాటు ఎలాంటి సేవలను అందించబోమంటూ ఆయన స్పష్టం చేశారు.

తిరుపతిలో ప్రభుత్వ కళాశాలలను స్థాపించండి


కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న హైకోర్టు న్యాయవాది కల్లూరు విష్ణువర్ధన్ రెడ్డి

తిరుపతి సిటీ: తిరుపతిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, హైకోర్టు న్యాయవాది కల్లూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన గురువారం రాష్ట్ర కాలేజియేట్ కమిషనర్ నారాయణ భరత్‌గుప్తకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ తిరుపతిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడం దారుణమన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యను అందుకోవడంలో విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించి వెంటనే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. వచ్చే విద్యా సంవత్సరానికి కళాశాలలను ప్రారంభించాలని కోరారు. ఆయన వెంకట హైకోర్టు న్యాయవాది ఆర్.అభిషేక్ రెడ్డి కూడా ఉన్నారు.

తిరుపతిలో భూ కబ్జాలను ప్రేరేపిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుపతిలో భూకబ్జాలను జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రేరేపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. వారు గురువారం శివజ్యోతినగర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకుని ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ తిరుపతి 45వ డివిజన్ శివజ్యోతినగర్‌లోని సర్వే నంబర్‌లో 697/2లో 4.23 ఎకరాలు ప్రభుత్వ అనాదీన భూమి ఉందని తెలిపారు. అందులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పీఏ కృష్ణకాంత్ అక్రమంగా ఇల్లు నిర్మించారని తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలను తొలగించాలని, లేనిపక్షంలో రెవెన్యూ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అజయ్‌కుమార్, వాసుయాదవ్, మహ్మద్ ఖాశీమ్‌బాయ్, ఉదయ్‌వంశీ, దినేష్ రాయల్, మల్లం రవికుమార్, మద్దాలి శేఖర్, గీతాయాదవ్, ముప్పాల సాయికుమార్, రాజేష్, రమణారెడ్డి, బాలాజి, శాంతారెడ్డి, పుణీత, పుష్పలత పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి కల్చరల్: జీవకోన ప్రాంతం, శివజ్యోతి నగరంలో సర్వే నంబర్ 697/3లో ఒకటిన్నర ఎకరా పట్టాభూమితో పాటు తమ అధీనంలోనున్న సర్వేనంబర్ 697/2లో ఉన్న 15 సెంట్ల స్థలానికి నకిలీ పట్టాలు సృష్టించి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వెంకట సుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి కృష్ణంరాజు 1977లో సదురు సర్వే నంబర్‌లో ఒకన్నటిన్నర ఎకరా భూమి కొనుగోలు చేశారని తెలిపారు. దాని పక్కనే 15 సెంట్లు పోరంబోకు స్థలంపై 2022లో హైకోర్టు స్టేటస్ కో ఇచ్చిందన్నారు. ప్రస్తుతం తిరుపతి ఎమ్మెల్యే అనుచరులు కృష్ణకాంత్, విజయ్‌కుమార్ ఆ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని వాపోయారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

మూడు సెంట్లు భూమికి పట్టా ఉంది

జీవకోన, తిరుపతి పట్టణం లెక్కదాఖలాలోనున్న 15 సెంట్ల స్థలానికి ప్రభుత్వం 1985లో తమ తల్లి ఆసియాబీ పేరున డీకేటీ పట్టా మంజూరు చేసిందని ఆసియాబీ కుమారుడు మీర్జాంశ తెలిపారు. దాన్ని తనకు రూ.6.50 లక్షలు అప్పు ఇచ్చిన విజయకుమార్‌కు విక్రయిస్తూ అగ్రిమెంట్ చేసి ఇచ్చానని పేర్కొన్నారు. అతను గురువారం విలేకరులతో మాట్లాడారు.


శివజ్యోతినగర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకుని ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు